
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం ౹ 3 ౹ డిసెంబర్ ౹ 2023



సోమశిలలో 29.734 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శని వారం సాయంత్రానికి 29.734 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 247 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.65,400
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,873
3 శాతం జీఎస్టీతో.. -	రూ.6,049
సవర (8 గ్రా) -	రూ.48,392

గరిష్టం/కనిష్టం
27.2 /24.3

వాతావరణం

శనివారం గాలిలో తేమ 97 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. ఆదివారం కూడా జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

91.23 శాతం పింఛన్ల పంపిణీ



నెల్లూరు రూరల్ గొల్లకందుకూరులో పెంచలయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చంద్రమౌళి

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. రెండో రోజు శనివారం 91.23 మంది లబ్ధిదారులకు పింఛన్ నగదును వలంటీర్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 3,15,544 మందికి పింఛన్ నగదు అందజేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2,87,872 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వలంటీర్లు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అవ్వాతాతల ఇళ్లకు వెళ్లి పింఛన్ కానుక అందజేశారు. వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీలో రాపూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాలు, బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ నెల 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్

నెల్లూరు(పొగతోట): మిచాంగ్ తుపాను నేపథ్యంలో ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ నీటి సరఫరా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్ 18004256488 ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు, ఉద్యోగులను ఆదేశించినట్లు తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులు జాగ్రత్తగా ఉండాలి

- వ్యవసాయ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్

నెల్లూరు(సెంట్రల్): మిచాంగ్ తుపాను ప్రభావంతో వ్యవసాయానికి సంబంధించి రైతులకు ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే వ్యవసాయశాఖ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 8331057220కు ఫోన్ చేయవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. తుపాను వల్ల వేసిన పంటలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

మూడు రోజుల పాటు పలు రైళ్లు రద్దు


నెల్లూరు(సెంట్రల్): మిచాంగ్ తుపాను నేపథ్యంలో రైల్వే శాఖ అప్రమత్తమైంది. నెల్లూరు మీదుగా వెళ్లే పలు రైళ్లను మూడు రోజులపాటు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రధానంగా నెల్లూరు మీదుగా వెళ్లే వందేభారత్ రైలును కూడా ఈ నెల 3, 4, 5 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వీటితో పాటు జనశతాబ్ది, ఇంటర్‌సిటీ, సింహపురి, పినాకిని, కేరళ, నవజీవన్, నారాయణాద్రి, చార్మినార్, పద్మావతి, హైదరాబాద్, జీటీ, శబరి, కృష్ణా, తిరుపతి, సర్కారు ఎక్స్‌ప్రెస్‌ల తోపాటు పాసింజర్ రైళ్లు, మెమూ రైళ్లు రద్దు చేసింది. తుపాను పరిస్థితికి అనుగుణంగా రైళ్ల పునరుద్ధరణ చేస్తామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ముంచుకొస్తున్న ‘మిచాంగ్’

- తీవ్ర వాయుగుండంగా మార్పు
- 4న విద్యాసంస్థలకు సెలవు
- స్పందన కార్యక్రమం రద్దు
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు
- జిల్లా కేంద్రం, డివిజన్లలో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- అప్రమత్తతపై అధికారులకు ఆదేశాలు

5 వరకు జిల్లాలో రెడ్ అలెర్ట్

బంగాళాఖాతంలో ఏర్పడనున్న మిచాంగ్ తుపాను తీరం వైపు దూసుకొస్తుండడంతో జిల్లాలో భారీ వర్షం కురుస్తోంది. సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. చాలాచోట్ల దాదాపు 50 మీటర్ల మేర సముద్రం ముందుకువచ్చింది. తీరప్రాంత మండలాల్లో జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు, రహదారులు వర్షపునీటితో ముంపునకు గురయ్యాయి. మరో 48 గంటల్లో బాపట్ల – నెల్లూరు మధ్య తుపాను తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.





నెల్లూరు(దర్గామిట్ట): బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారిన నేపథ్యంలో జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. వాతావరణశాఖ సూచనల మేరకు కలెక్టర్ హరినారాయణన్ శనివారం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని అత్యవసరమైతే తప్ప సాధారణ సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నుంచి తుపాను మరింత ప్రభావం చూపనుండడంతో జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో 1077, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా కలెక్టర్ తగిన చర్యలు చేపట్టారు. విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు ముందస్తు సూచనలు జారీ చేశారు.

ముసురు.. జడివాన

తీవ్ర వాయుగుండం నేపథ్యంలో ఆకాశం మరింత మేఘావృతమై జిల్లా అంతటా జడివాన కురుస్తోంది. నెల్లూరు నగరంలో శనివారం నుంచే మేఘాలు కమ్మేసి వర్షం కురిసింది. జిల్లాలోని పొదలకూరు, కలువాయి, రాపూరు, అనంతసాగరం, ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, మర్రిపాడు, కావలి, సంగం, బుచ్చిరెడ్డిపాళెంతోపాటు సముద్ర తీర ప్రాంతాల్లో వర్షం జోరుగా కురుస్తోంది. మిచాంగ్ తుపాను నేపథ్యంలో ఈ నెల 5వ తేదీ వరకు రెడ్ అలెర్ట్ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలకు సంబంధించి డివిజన్, మండలస్థాయి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.



ముత్తుకూరు మండలంలో సముద్ర తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు

యంత్రాంగం అప్రమత్తం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు తుపాను ప్రభావం జిల్లాలో ఉంటుందని, 3వ తేదీ మధ్యాహ్నం నుంచి వర్షంతోపాటు గాలులు వీచే అవకాశం ఉందని, 4న భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ రెడ్ ఎలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. తుపాను నేపథ్యంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, పౌరసరఫరా తదితర శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 1077 కాల్ సెంటర్ 24 గంటలు పనిచేసేలా సిబ్బందిని నియమించామని, అలాగే క్షేత్రస్థాయిలో తుపానును ఎదుర్కొనేలా అన్ని శాఖల సిబ్బందిని సమాయత్తం చేయడంతో పాటు డివిజన్ కేంద్రాల్లో కూడా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ ఆదేశాలిచ్చామన్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు చేపల వేటకు వెళ్లకుండా సముద్ర తీర, పెన్నానది పరీవాహక ప్రాంతాల మత్స్యకారులను అప్రమత్తం చేశామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో నేపథ్యంలో 3 నుంచి 5వ తేదీ వరకు ప్రభుత్వ సిబ్బందికి ఎలాంటి సెలవులు ఇవ్వరాదని, ఎవరూ హెడ్‌క్వార్టర్స్ దాటి వెళ్లరాదని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. పౌరసరఫరాలశాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నిత్యావసర సరుకులు అవసరమైన మేరకు సిద్ధం చేసుకునేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు ఇంకా ఎక్కువ ఇన్‌ఫ్లో తీసుకునే సామర్థ్యం ఉందని, అయినప్పటికీ అప్రమత్తంగా ఉండేలా సంబంధిత ప్రాజెక్టుల ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే వైద్యసేవలకు అంతరాయం లేకుండా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. రాబోయే మూడు రోజుల్లో అవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లరాదని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

తీవ్ర వాయుగుండం తుపానుగా..

నెల్లూరు, బాపట్లకు మధ్య తీరానికి దగ్గర్లో తీవ్ర వాయుగుండం బలపడి తుపానుగా మారే అవకాశముంది. దీని ప్రభావంతో గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఆదివారం రాత్రి నుంచి మంగళవారం వరకు బలమైన ఈదురుగాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ వెల్లడించింది.

ఆదివారం కూడా ఓటర్ల నమోదు

- కలెక్టర్ హరినారాయణన్



ఫాం-6 అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం కూడా ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమం జరుగుతుందని, ఓటు హక్కు లేని వారు తమ ఓటు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక డీకే డబ్ల్యూ కళాశాలలోని 120, 121, 123, 124, 125, 127 పోలింగ్ బూత్‌లలో ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఓటర్ల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని, ఓటు హక్కు లేని వారు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఫాం-6 పూర్తి చేసి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మీ పేరు ఉందో లేదో పరిశీలించుకోవచ్చని, ఓటు లేకపోతే నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 18–21 సంవత్సరాల లోపు యువత ఓటర్లుగా నమోదు కావాలని, ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఓటరుగా నమోదు కావడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. కళాశాలలో చదువుతూ 18 సంవత్సరాలు నిండిన వారందరూ పోలింగ్ బూత్‌లో దరఖాస్తు అందజేసినట్లయితే సంబంధిత నియోజకవర్గ అధికారులకు పంపుతామన్నారు.

ఓటు నమోదు చేసుకున్న కలెక్టర్

స్థానిక డీకేడబ్ల్యూ కళాశాలలో ఓటర్ల స్పెషల్ క్యాంపెయిన్ పరిశీలనకు వచ్చిన కలెక్టర్ బీఎల్వో వద్ద ఫాం-6 తీసుకుని వివరాలు పూర్తి చేసి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ సోమ్లానాయక్, ప్రిన్సిపల్ హరి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. లక్ష దీపోత్సవం



కార్తీక లక్ష దీపోత్సవంలో అఖండ దీపారాధన చేస్తున్న విద్యారణ్య భారతీస్వామి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు



వీఆర్‌సీ గ్రౌండ్‌లో లక్ష దీపోత్సవంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



మహాశివునికి మంగళహారతి ఇస్తున్న భక్తురాలు

- భక్తి ప్రపత్తులతో విశేష పూజలు
- శివ నామస్మరణతో మార్మోగిన సింహపురి
- వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- అనుగ్రహ భాషణం చేసిన విద్యారణ్య భారతీస్వామి

నెల్లూరు(బృందావనం): నగరంలోని వీఆర్సీ ఉన్నత పాఠశాల మైదానంలో రెండో రోజు శనివారం కార్తీక లక్ష దీపోత్సవం కనులపండువగా సాగింది. ఒక వైపు వర్షం దోబూచులాడుతున్నప్పటికీ భక్తులు హరిహరాదులను పూజిస్తూ, శివకేశవులను స్మరిస్తూ కార్తీక లక్ష దీపోత్సవంలో పాల్గొన్నారు. వీపీఆర్ ఫౌండేషన్, కార్తీక లక్ష దీపోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఢిల్లీ స్థానిక సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో శనివారం రాత్రి హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధీశులు పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శంకరాచార్య విద్యారణ్యభారతి స్వామితో కలిసి వేమిరెడ్డి దంపతులు, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తదితరులు అఖండ దీపాన్ని వెలిగించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్తీక లక్ష దీపోత్సవాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. విద్యారణ్య భారతీస్వామి శ్రీవైద్యనాథ్ శివలింగానికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఉడుపి శ్రీకృష్ణభగవాన్‌కు నవనీత సేవ చేశారు. తొలుత విద్యారణ్య భారతీస్వామిని వేదపండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు.

భక్తి ప్రపత్తులతో..

శనివారం ఉదయం వీఆర్సీ మైదానానికి విచ్చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులను వేదపండితులు పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అనంతరం మండపం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో రుద్రహోమం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మండపంలోని వేదికపై కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి 108 మంది దంపతులు పంచ బిళ్వార్చన, అభిషేకాలు విశేషంగా నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ కుబేరహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో వెంకటగిరి రాజ వంశీకులు సర్వజ్ఞ కుమార యాచేంద్ర, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్తీక లక్ష దీపోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేసిన వీరిని వేమిరెడ్డి దంపతులు, కమిటీ సభ్యులు సత్కరించారు. తాత్కాలికంగా ప్రతిష్ఠించిన స్ఫటిక లింగానికి ‘సంతత ముధకధారాభిషేకం’ నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజా కార్యక్రమాలు వేదపండితులు గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన సత్యస్వరూపిణి, పాటూరి రాధాకృష్ణ దంపతుల వ్యాఖ్యానంతో సాగాయి.

కార్తీక లక్ష దీపోత్సవంలో నేడు

కార్తీక లక్ష దీపోత్సవంలో భాగంగా మూడో రోజు ఆదివారం ఉదయం 8.30 గంటలకు విశేష చండీ యాగం, 9 గంటలకు 501 మంది దంపతులతో సామూహికంగా శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతం, మధ్యాహ్నం ఒంటిగంటకు వీపీఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 6.45 గంటలకు లక్ష దీపోత్సవం కార్యక్రమం జరగనుంది. అనంతరం బుర్రా భాస్కరశర్మ ‘కార్తీక దీప వైభవం’పై ప్రవచనం నిర్వహించనున్నారు. కార్యక్రమం పరిసమాప్తం సందర్భంగా శివపార్వతుల శాంతి కల్యాణోత్సవం జరగనుంది.

దీపం జ్ఞాన కాంతులను అందిస్తుంది : విద్యారణ్య భారతీస్వామి



దీప ప్రజ్వలన అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానమనే కాంతులను అందిస్తుందని, సనాతన ధర్మంలో దీపానికి ఎంతో ప్రాధాన్యం ఉందని విద్యారణ్య భారతీస్వామి అనుగ్రహ భాషణ చేశారు. దీపాలు వెలిగించడం ద్వారా శరీరంలో ప్రాణమున్నంత వరకు ఎలాంటి సమస్యలు దరిచేరవన్నారు. ఎంతో విశేషమైన కార్తీక మాసంలో దీపాలను వెలిగించడం ద్వారా ముక్తి, మోక్షం ప్రాప్తించడంతోపాటు దైవానుగ్రహం సిద్ధిస్తుందని మహర్షులు తెలిపారని పేర్కొన్నారు. దీపం వెలిగించి పరమేశ్వరుడి అనుగ్రహం పొందాలన్నారు. భారతీయ ఆచార వ్యవహారాలతో భారతావనికి ఎంతో పరిపుష్టి ఒనగూరిందని తెలిపారు. ఆంగ్లేయులరాకతో భారతీయ సనాతన ధర్మం ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ ప్రపంచంలో మేటి ధర్మంగా నేటికీ వెలుగొందుతుందన్నారు. ఈ సనాతన ధర్మాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత నేటి, రేపటి తరంపై ఉందన్నారు. భారతీయ ఆచార వ్యవహారాలు ఎంతో గొప్పవని, వీటి ఆధారంగానే విదేశీ శాస్త్రవేత్తలు ఎన్నో ఆవిష్కరణలు చేసి అవి తమవిగా చెప్పుకున్నారని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా వ్యవహరించిన బరాక్ ఒబామా దీపావళి నాడు దీపాలు వెలిగించి భారతీయ సనాతన సంప్రదాయానికి మరింత ఉన్నతిని కలిగించారన్నారు. భారతీయ జీవన విధానంలో, సంస్కృతిలో మాతృమూర్తికి ఉన్న గౌరవం ఎంతో విశిష్టమైందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రీసెర్చ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాచలం: వీఎస్‌యూలో ఐసీఎస్సెస్సార్ నిధులతో మహిళా వ్యవస్థాపక టైటిల్ ప్రాజెక్ట్‌పై రీసెర్చ్ కోసం రీసెర్చ్ అసిస్టెంట్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సాయిస్రవంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ రీసెర్చ్ స్కాలర్స్, పీహెచ్‌డీ చేసిన వారే అర్హులని చెప్పారు. దరఖాస్తులను sravanthi.mba@vsu.ac.inకు ఈ నెల 18లోపు పంపాలని కోరారు. వీఎస్‌యూలో ఇంటర్వ్యూలను ఈ నెల 20న నిర్వహించనున్నామని వివరించారు.

జిల్లాలో 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చెదురుమదురు వర్షాలు కురుసున్నాయి. జిల్లాలో శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు సగటున 3.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముత్తుకూరు మండలంలో 14, విడవలూరులో 13, దగదర్తిలో 10.4, నెల్లూరు అర్బన్‌లో 9.4, నెల్లూరు రూరల్‌లో 7, కోవూరులో 8.8, రాపూరులో 8.8, కలువాయిలో 8.6, ఆత్మకూరులో 8, చేజర్లలో 5.2, బోగోలులో 4.8, సంగంలో 4.4, కొడవలూరులో 4.2, తోటపల్లిగూడూరులో 3.6, అనంతసాగరంలో 3.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి



నెల్లూరు(బారకాసు): తుఫాన్ ప్రభావం నగరంపై ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు చేపట్టాలని మేయర్ స్రవంతి సూచించారు. తుఫాన్ అప్రమత్తతపై కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అన్ని విభాగాల అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో తుఫాన్లు వచ్చినప్పుడు ఏ ప్రాంతాలు ప్రభావితమయ్యాయి.. ఎడతెరపి లేకుండా వర్షాలు పడినప్పుడు ఏ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయో పరిశీలించి ఇప్పటికే ముందస్తు ప్రణాళికను సిద్ధం చేశామని తెలిపారు. ఏదైనా ప్రాంతాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉంటే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ముందస్తు చర్యలతో నగరపాలక సంస్థ అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యాసంస్థలకు సెలవున సోమవారం ప్రకటించారని, ప్రజలు తగు జాగ్రత్తలు పాటించి ఎక్కడైనా ఇబ్బంది ఉంటే వెంటనే కంట్రోల్ రూమ్ 1800 425 1113, 0861 – 2305141 నంబర్లకు సమాచారం లేదా నేరుగా కార్పొరేషన్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. నగరపాలక సంస్థ అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. కమిషనర్ వికాస్ మర్మత్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి

సంగం: మండలంలోని సిద్ధీపురం వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తూ గేదెను ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ యువకుడు శుక్రవారం రాత్రి మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. సిద్ధీపురానికి చెందిన దినేష్, శీనయ్య దువ్వూరుకు నవంబర్ 29న వెళ్లారు. అనంతరం తిరిగొస్తూ గేదెను ఢీకొని గాయపడ్డారు. వీరిలో చికిత్స పొందిన దినేష్ (39) మరుసటి రోజు ఇంటికొచ్చారు. ఈ క్రమంలో కడుపు నొప్పంటూ నెల్లూరులోని వైద్యశాలకు శుక్రవారం వెళ్లి అపస్మారక స్థితిలో మృతి చెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై నాగార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేశ్వరపురంలో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన వెంకటేశ్వరపురంలోని లక్ష్మీవీధిలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు.. లక్ష్మీవీధిలో నివాసం ఉంటున్న సుమన్ దంపతులు బ్యాంక్ ఉద్యోగులు. డెలివరీ నిమిత్తం తన భార్యను నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో గత నెల 29న చేర్పించారు. అప్పటి నుంచి ఇంట్లో సుమన్ బావమరిది ఉంటున్నారు. ఈ క్రమంలో ఆయన సైతం హాస్పిటల్‌కు శుక్రవారం వెళ్లారు. ఈ తరుణంలో గ్రిల్స్ తాళాలను గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలోని నగదు, 20 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఇంటికి ఉదయం వచ్చిన బాధితుడు చోరీ విషయాన్ని నిర్ధారించుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.88
లేయర్	రూ.95
బ్రాయిలర్ చికెన్:	రూ.166
స్కిన్‌లెస్ చికెన్:	రూ.186
లేయర్ చికెన్:	రూ.162

సంపూర్ణంగా హామీల అమలు



పంటపాళెంలో పక్కాగృహాలను ప్రారంభిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంపూర్ణంగా అమలు చేశారని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ముత్తుకూరు మండలంలోని పంటపాళెం పంచాయతీలో రూ.3.06 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి శనివారం ప్రారంభించారు. జగనన్న కాలనీలో ఇళ్లు, స్కూల్ ప్రహరీ, సీసీ రోడ్లు, యూపీ స్కూల్లో నాడు – నేడు పనుల ప్రారంభం.. కోళ్లమిట్టలో జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పంటపాళెంలో ఇప్పటి వరకు రూ 6.78 కోట్లను అభివృద్ధి పనులకు విడుదల చేశామని చెప్పారు. మండలంలో 378 మంది లబ్ధిదారులకు 290 ఎకరాల అసైన్‌మెంట్ భూములను పంపిణీ చేశామని వెల్లడించారు. వరుణ దేవుడి కరుణతో రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయని, జిల్లా రైతాంగానికి ఎంతో మేలు జరిగిందని, కరువు పరిస్థితులను జయించామని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, నేతలు మారు సుధాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, ప్రభాకర్‌నాయుడు, చెంగారెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఓ మోసకారి



రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి.. అనంతరం వాటి మాట ఎత్తకుండా దబాయించే మోసగాడు చంద్రబాబు అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని పాతూరులో గల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత శ్రీనివాసులురెడ్డి నివాసంలో నేతలతో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం కొత్త హామీలతో చంద్రబాబు వస్తున్నారని, ఆయన్ను నమ్మితే నట్టేట మునగడం ఖాయమన్నారు. ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పొత్తులతో మాయగాళ్లు వస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్టీఆర్ మనవడనే ఒక్క కారణంతో రాజకీయాల్లో లోకేశ్ చెలామణి అవుతున్నారని చెప్పారు. రాష్ట్రంపై అవగాహన లేని పవన్ కల్యాణ్ ఆయనకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. మహేంద్రయాదవ్, శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు, షాహుల్ హమీద్, ప్రసన్నాంజనేయులు పాల్గొన్నారు.

'మిచాంగ్'ను ఎదుర్కొనేందుకు సిద్ధం

• పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్
• అత్యవసర పరిస్థితుల్లో 93929 03413కు సమాచారమివ్వాలి
• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. తుఫాన్ నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై పోలీస్ సిబ్బందితో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాన్ నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, అగ్నిమాపక తదితర శాఖల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని సూచించారు. ప్రజలకు అన్ని విధాలా సహాయ సహకారాలను అందించాలని ఆదేశించారు. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాలు పొంగిపొర్లే అవకాశం ఉన్న తరుణంలో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు సముద్రంలోకి ఎవరూ వెళ్లకుండా భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఎడతెరపి లేని వర్షాల కారణంగా ప్రజలు, ప్రజా రవాణా వ్యవస్థకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. రహదారులపై చెట్లు కూలాయని సమాచారం అందిన వెంటనే వాటిని తొలగించి రవాణా సేవలను పునరుద్ధరించాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తుఫాన్ నేపథ్యంలో జిల్లా పోలీస్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. విపత్కర పరిస్థితులు, అనుకోని ఘటనలు జరిగితే వెంటనే జిల్లా కేంద్రంలోని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. డయల్ 112 లేదా కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 93929 03413కు సమాచారం అందిస్తే తగు సహాయక చర్యలను అందిస్తామని ఆయన తెలిపారు.

విద్యుత్ శాఖ కమాండ్ కంట్రోల్ రూమ్స్ ఇవే

డివిజన్	కంట్రోల్ రూమ్ నోడల్ ఆఫీసర్	ఫోన్ నంబర్
నాయుడుపేట	రాఘవేంద్రం (ఈఈ)	73826 23178
గూడూరు	సుధాకర్ (ఈఈ)	79010 36852
నెల్లూరు రూరల్	జగదీష్ (ఈఈ)	89199 87020
నెల్లూరు టౌన్	బాలచంద్రశేషాద్రి (ఈఈ)	94408 17470
కోవూరు	మధు (ఈఈ)	94408 17471
కావలి	పరంధామయ్య (ఈఈ)	79010 56437
ఆత్మకూరు	జనార్దన్ (ఈఈ)	79010 56806

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో మిచాంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని.. జిల్లా సర్కిల్ పరిధిలోని ఏడు డివిజన్లలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ ద్వారా కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, తాను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

కంట్రోల్ రూమ్ నోడల్ ఆఫీసర్లు శనివారం రాత్రి నుంచి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాల నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు, అన్నదాతలు, ఆక్వా రైతులు వారు వాడే విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు, ఏరియేటర్లను ఎట్టి పరిస్థితుల్లోనే తాకొద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలు, చెట్ల కింద నిలవొద్దని కోరారు. విద్యుత్ స్తంభాలు కూలినా.. వైర్లు తెగిపడినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బంది, కమాండ్ కంట్రోల్ రూమ్ లేదా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్లకు సమాచారం అందించాలని కోరారు.

ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన

• జిల్లా పరిశీలకుడు పోలా భాస్కర్



ఉలవపాడులో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడుతున్న భాస్కర్

నెల్లూరు(దర్గామిట్ట): రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఈసీ నిబంధనల మేరకు పరిష్కరించాలని ఫొటో ఓటరు జాబితా సంక్షిప్త సవరణ రోల్ జిల్లా పరిశీలకుడు పోలా భాస్కర్ ఆదేశించారు. ఫొటో ఓటరు జాబితాల సంక్షిప్త సవరణ కార్యక్రమానికి సంబంధించి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడారు. జిల్లాలో 2,317 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, 2,317 మంది బీఎల్వోలతో పాటు 10 మంది బీఎల్వోలకు ఒక సూపర్‌వైజర్ చొప్పున 232 మందిని నియమించామని తెలిపారు. అనంతరం పోలా భాస్కర్ మాట్లాడారు. ఫొటో ఓటర్ల జాబితాల సంక్షిప్త సవరణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అసలైన ఓటర్లను నమోదు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫారం – 6, 7, 8 క్లెయిమ్‌లను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కరించాలని తెలిపారు. జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, మధులత, నుడా వీసీ బాపిరెడ్డి, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఓట్ల నమోదుపై దృష్టి

ఉలవపాడు: పద్దెనిమిదేళ్లు నిండిన విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేసే అంశమై దృష్టి సారించాలని పోలా భాస్కర్ పేర్కొన్నారు. ఉలవపాడులోని హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలతో సమావేశాలను ఏర్పాటు చేసి అర్హులైన విద్యార్థులకు ఓటు హక్కును కల్పించాలని సూచించారు. ఇక్కడ నివాసం ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు ఉండాలన్నారు. ఓటరు లిస్టులో సున్నాలు, అడ్రస్ లేకుండా బొమ్మలు, నంబర్లు పడటం తదితరాలు ఉంటే విచారణ జరిపి తొలగించాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ శోభిక, జేసీ కూర్మనాథ్, తహసీల్దార్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు కావలి విద్యార్థులు



విద్యార్థులకు అభినందన

కావలి: పట్టణంలోని రాజావీధిలో గల ఓవెల్ మినర్వా పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థులు అక్షయ్, సాయి ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపల్ సురేష్ తెలిపారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. విజయవాడ సమీపంలోని కేఎల్ వర్సిటీలో నవంబర్ 29, 30న నిర్వహించిన రాష్ట్ర స్థాయి 31వ జాతీయ బాలల విజ్ఞాన సమ్మేళనంలో వీరు సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సీఈఓ ప్రమీల, డైరెక్టర్ వేణు, గైడ్ టీచర్ శివయ్య, స్కూల్ ఇన్‌చార్జి సుకుమార్, జీఎం మహదేవ్, డీజీఎం వహాబ్, ఏజీఎం జైదేవ్ తదితరులు పాల్గొన్నారు.